క్లుప్తంగా

అవయవదానం సామాజిక బాధ్యత



ముత్యాలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: అవయవదానం చేయడం ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించాలని హెచ్‌ఎం జి.తాతారావు సూచించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని ప్రధాన పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం అవయవదానంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అవయవదానం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాగిడి రాంబాబు, ఉపాధ్యాయులు కోటేశ్వరి, బంగారమ్మ, బర్రి వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాల పంపిణీ



ఎల్బీచర్లలో విత్తనాలను అందజేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదలకు నారుమడులు నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా సబ్సిడీ పై విత్తనాలను మంగళవారం అందించారు. ఏడీఏ ఈదా అనిల్‌కుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మైలాబత్తుల సోని, గ్రామ సర్పంచ్ గుబ్బల యమునా భానుమూర్తి తదితరులు మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదల కారణంగా సాగుకు ఆలస్యం కావడంతో తక్కువ రోజుల్లోనే కోతకు వచ్చే వరి వంగడాలను 80 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు. ఎంటీయూ 1153 అనే రకం విత్తనాలను అందించారు. ముంపునకు గురైన నారుమడులు కలిగిన రైతులు వెంటనే పంట ఊడ్చుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు భవాని, రైతులు స్టాలిన్, మాత్రరాజు, గోపాలరావు, సంజీవరావు, వీఏఏ సాయిదుర్గ పాల్గొన్నారు.

న్యాయ సేవా సంస్థతో న్యాయం



సదస్సులో మాట్లాడుతున్న చేగొండి శ్రీరంగ మోహన బాలాజీ

యలమంచిలి: న్యాయవాదులను పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని వారికి న్యాయపరమైన సలహాలను ఇవ్వడానికి న్యాయ సేవా సంస్థ అందుబాటులో ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి శ్రీరంగ మోహన బాలాజీ చెప్పారు. నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. వితంతు పింఛన్‌కు అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా పింఛన్ రాకపోయినా, మానసిక వికలాంగులు, అంగవైకల్యం కలిగిన వారు న్యాయ సేవా సంస్థను ఆశ్రయించి ఉచిత సలహాలు పొందవచ్చునని బాలాజీ చెప్పారు. న్యాయవాది ఫణికర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా జాగ్రత్తగా గమనించాలని కోరారు. న్యాయవాది నారిన శ్రీనివాసరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 14న నరసాపురం కోర్టు ఆవరణలో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లీగల్ సర్వీస్ సభ్యులు వెంకటేశ్వరరావు, ఏపీఎం మళ్ల సోని పాల్గొన్నారు.

బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి ఉండికి చెందిన ముదునూరి పద్మరాజు–విజయలక్ష్మి దంపతులు మంగళవారం ఎనిమిది గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందించారు. ముందుగా దాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన



లంకలకోడేరులో తడి చెత్త, పొడిచెత్త సేకరణ పరిశీలిస్తున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు



సీతారామపురంలో ఘనవ్యర్థాల నిర్వాహణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్‌లు, కార్యదర్శులు

పాలకొల్లు అర్బన్: తడి చెత్త, పొడి చెత్త సేకరణ తీరు, వర్మి కంపోస్టు తయారీ విధానాలను సర్పంచ్‌లు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల్లో మంగళవారం లంకలకోడేరులో ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్డును పరిశీలించారు. వరి కంపోస్టు తొట్టెలను పరిశీలించి అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించి వాటి ద్వారా వర్మి కంపోస్టును తయారు చేసుకుని పంచాయతీలకు ఆదాయ వనరులను పెంచుకోవాలని ట్రెనింగ్ ఆఫీసర్లు బి.ఆనందబాబు, కేవీ నాగయ్యో, జయహర్ష సర్పంచ్‌లకు వివరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దీంతో ప్రజలకు మంచినీరు సరఫరా విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవా లన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కచ్చా డ్రెయిన్‌లు నిర్మించాలన్నారు. మురుగు నీటి నిలువలు నివాసాల మధ్య లేకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ముగ్గు, బ్లీచింగ్‌తో పాటు దోమల నిర్వహణకు మందు పిచికారీ చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏఏ ప్రాధాన్యత అంశాలకు ఖర్చు చేయాలో? సర్పంచ్‌లు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. అలాగే రికార్డుల నిర్వహణ, వాటిని జాగ్రత్త పరచుకోవాలన్నారు. అలాగే నిధుల వ్యయం, ఖర్చు, ఆదాయ, వనరుల రాబడి తదితర అంశాలను ఆడిటింగ్ చేయించుకుని వాటిలో ఏ పొరపాట్లు లేకుండా చూసుకోవాలన్నారు. నిధుల వ్యయంలోనూ, రికార్డుల నిర్వహణలో ఏమైనా లోటుపాట్లు తలెత్తితే ఆయా గ్రామాల సర్పంచ్‌లపై సర్‌ఛార్జీ పడుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఈవోపీఆర్డీ కేఎం వైభవతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కొత్రా గోవిందరాజులు, పంచాయతీ కార్యదర్శులు ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా), లింగం సత్యనారాయణ, డీఎస్ పద్మాజీరావు, ఓదూరి సూర్యప్రకాశరావు, మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

నరసాపురం రూరల్: సర్పంచ్‌లు తమ గ్రామాల్లో ప్లాస్టిక్ రహితంగా ఉండే విధంగా పరిపాలన సాగించాలని తద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని నరసాపురం మొగల్తూరు ఈఓపీఆర్డీలు కె.ఆంజనేయశర్మ, ఎం.నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమం రెండవ రోజులో భాగంగా నరసాపురం మండలం సీతారామపురం సౌత్ గ్రామ పరిధిలోని ఘన వ్యర్థాల కేంద్రాన్ని ఫీల్డ్ విజిట్‌లో భాగంగా సందర్శించారు. సీతారామపురం గ్రామ సర్పంచ్ దొండపాటి వెంకట్ మాట్లాడుతూ ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రం నిర్వహణ ఆర్థికంగా భారమైనప్పటికీ చెత్త సమస్య పరిష్కారానికి మరో మార్గం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు లేవనెత్తిన పలు సందేహాలను డివిజనల్ రీసోర్స్ పర్సన్ విశ్వనాథం, ట్రెనీలు పిప్పళ్ల సాయిరామ్, యడ్లపల్లి కృష్ణ, ఎంపీడీఓ కె.వీరభద్రరావు తదితరులు నివృత్తి చేశారు.



వడలిలో వర్మీకంపోస్ట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

మార్కెంటింగ్ విధానాలపై అవగాహన

పెనుగొండ: వర్మీ కంపోస్ట్ మార్కెటింగ్ విధానాలపై క్షేత్ర స్థాయిలో అవగాహనతో కలిగి ఉండాలని పెనుగొండ ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ దొర అన్నారు. మంగళవారం సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ తరగతుల్లో భాగంగా వడలిలో వేస్ట్ మెనేజ్‌మెంట్ , వేస్ట్ కలెక్షన్ ప్రాసెస్‌లపై అవగాహన కల్పించారు. పెనుగొండ మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకట రెడ్డి, విజయకుమార్, రామరాజు, శర్మ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక పెదగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు దేశభక్తి గేయాలు, పద్యాలు, ఆటల పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం నిల్లా సురేష్ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన పోరాటాలు, త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. విజేతలకు గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ కోటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

అధ్వానంగా మొక్కల పెంపకం

నరసాపురం: మునిసిపాలిటీలో మొక్కల పెంపకం అధ్వానంగా మారింది. చిత్తశుద్ధి లేకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంతో ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది. మొత్తంగా లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం నెరవేరకుండా పోతుంది. నాలుగేళ్లుగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏటా అట్టహాసంగా జరుపుతోంది. పట్టణంలో పలు దఫాలుగా మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం అధికారులు గాలికి వదిలేశబురు. దీంతో పట్టణంలో గోదావరిగట్టు, వైఎస్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వేస్టేషన్‌రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడం లేదు. ముఖ్యంగా కొన్ని చోట్ల నీళ్లు పోయకపోవడంతో మొక్కలు చనిపోగా, మరికొన్ని చోట్ల నాటిన మొక్కలను పశువులు తినేశాయి.

అగ్నాస్త్రం తయారీపై అవగాహన

పెనుమంత్ర: వరిలో వచ్చే కాండం తొలుచు పురుగు నివారణ కోసం అగ్నాస్త్రం తయారీపై మంగళవారం జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మల్లిపూడి గ్రామ రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారిణి కృపావతి మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని పండించడంతో అగ్నాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని, దానిని రైతులు సొంతంగా చేసుకునే విధానాన్ని వివరించారు. 20 లీటర్ల ఆవు మూత్రం, 20 కిలోల వేపాకు, రెండు కిలోల పచ్చిమిర్చి, కిలో వెల్లులి, 5 కిలోలు పొగాకు కాడలతో మిశ్రమాన్ని తయారు చేసి రైతులకు తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, ఐసీఆర్పీ సుబ్బలక్ష్మి, రైతులు దండు బుజ్జి పండురాజు, కృష్ణంరాజు, గుడిమెట్ల శ్రీరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అగ్నాస్త్రం తయారీ విధానాన్ని వివరిస్తున్న దృశ్యం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం భద్రతపై దృష్టి

నరసాపురం: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం భద్రతపై దృష్టిపెట్టామని జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం ఆయన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు భద్రత, అగ్నిప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏంటి?విద్యుత్ వైరింగ్ ఎలా ఉంది? అనే అంశాలు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాయంలో అగ్నిప్రమాదం జరిగిన దృష్ట్యా అలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశామన్నారు. 150 సంవత్సరాల క్రితం నిర్మించిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థలో ఉందని చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు. ఆయన వెంట నరసాపురం అగ్నిమాపకశాఖ అధికారి రామ్‌భాస్కర్, ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్ ఉన్నారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు

దూరవిద్య కోర్సులను వినియోగించుకోవాలి

నరసాపురం: దూరవిద్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ డి.పుష్పరాజ్యం సూచించారు. మంగళవారం పట్టణంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు దూరవిద్య కోర్సులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్యం మాట్లాడుతూ దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్స్ ఆహ్వానిస్తున్నారని చెప్పారు. 14 ఏళ్లు నిండిన వారు దూరవిద్య ద్వారా పదో తరగతి పూర్తి చేయొచ్చని చెప్పారు. అలాగే ఇంటర్మీడియట్ పూర్తి చేయాలనుకునేవారు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వివరించారు. ఎంఈఓ–2 జాన్‌ప్రభాకర్ మాట్లాడుతూ అడ్మిషన్స్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకూ గడువు ఉందన్నారు. చిరువ్యాపారాలు చేసుకునేవారు, ముఖ్యంగా మహిళలు ఈ అవకాశం వినియోగించుకుని పదో తరగతి ఉత్తీర్ణత సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జి.వీరాస్వామి, వీఎల్ఎస్ నాగేశ్వరి, జి.ఇందిరావాణి, ఎస్.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో ర్యాలీ నిర్వహిస్తోన్న దృశ్యం

అర్చకులు, పురోహితుల సంఘాలను ఏర్పాటు చేయాలి

యలమంచిలి: మండల స్థాయిలో అర్చకులు, పురోహితుల సంఘాలను ఏర్పాటు చేయాలని అర్చక పురోహిత సంఘ రాష్ట్ర కన్వీనర్ శివశంకర్ కోరారు. విశ్వహిందూ పరిషత్ సత్యాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మేడపాడు గ్రామ దేవత వెంకమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన సమాజం పునరుద్ధరణలో అర్చకుల పాత్ర ఏ విధంగా ఉండాలో? వివరించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కటకంశెట్టి నాగేంద్ర, మండల కార్యదర్శి దివి ప్రకాష్, భజరంగ్‌దళ్ జిల్లా సహ కన్వీనర్ ముత్యాల చంటి, భజరంగ్‌దళ్ మండల కన్వీనర్ వినుకొండ శివ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సత్కారం

యలమంచిలి: సార్వత్రిక ఎన్నికల సమయంలో కృష్ణా జిల్లా నందిగామ నుంచి యలమంచిలి ఎంపీడీఓగా బదిలీపై వచ్చిన పి.శ్రీనివాసరావు మళ్లీ తిరిగి నందిగామకు బదిలీ కావడంతో సోమవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ పి.శ్రీనివాసరావును కార్యాలయ సిబ్బంది శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ అమీర్ షరీఫ్, పంచాయతీరాజ్ ఏఈ వర్ధనపు శ్యాంబాబు పంచాయతీ కార్యదర్శులు పాలా శారదా శ్రీనివాస్, మాదాసు హరిప్రసాద్, పీతల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ పి.శ్రీనివాసరావును సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

పాలకొల్లుసెంట్రల్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నుంచి యడ్లబజారు సెంటర్ వరకూ 78వ స్వాతంత్ర్య వక్షోత్సవాల్లో భాగంగా భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎందరో మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండాను ఏర్పాటు చేసుకుని దేశభక్తిని చాటుకోవాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలతో పాటు 550 అడుగుల జాతీయ జెండాతో సుమారు వెయ్యి మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముందుగా గాంధీబొమ్మల సెంటర్ వద్ద ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జక్కంపూడి కుమార్, పెచ్చెట్టి బాబు, రావూరి సుధ, కర్నేని గౌరునాయుడు, అల్లూరి పద్మవర్మ, యర్రంశెట్టి పద్మారావు, తులా రామలింగేశ్వరరావు, గవర పవన్‌నాయుడు, శిడగం సూరి, దనాని సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొల్లులో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

నరసాపురంలో..

నరసాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు పాఠశాల విద్యార్థులు ఘర్ ఘర్ తిరంగా హర్ ఘర్ తిరంగ ర్యాలీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేముల దీవి గొందిమూల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు ఉప్పుగంటి రాజశ్రీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు ఈ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని పలు రహదారుల్లో భారీ మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తూ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీ అందరినీ ఆకర్షించింది.

కొబ్బరిచెట్టు విరిగిపడడంతో విద్యుత్ లైన్ ధ్వంసం

పెనుమంత్ర: వెలగలవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని తాళ్ల చెరువు రోడ్డులో భట్లమగుటూరు కెనాల్‌గట్టున కొబ్బరిచెట్టు కూలిపడటంతో 11 కేవీ విద్యుత్‌లైన్ దెబ్బతింది. మంగళవారం ఉదయం 11 గంటలప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న కొబ్బరిచెట్టు చివికి విరిగిపడింది. ఆ సమయానికి ఆ ప్రదేశంలో జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. విద్యుత్ సరఫరాను నిలిపివేసి కొబ్బరి చెట్టును తొలగించిన అనంతరం విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

పెనుమంత్ర: బాల్యవివాహ నిషేధ చట్టం 2006పై సంబంధిత శాఖల అధికారులు అవగాహనతో ఉండి బాల్యవివాహాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని పెనుమంత్ర ప్రాజెక్టు స్త్రీ శిశుసంక్షేమ అధికారిణి కె.కృష్ణకుమారి అన్నారు. మంగళవారం పెనుమంత్ర మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి, ముందుగానే నివారణా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పి.లలితాశ్రీ, ఎంపీడీఓ పి.పద్మజ, ఎంఈఓ–2 యు.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనకరత్నమాలకు డాక్టరేట్

పెనుగొండ: పాండిచెరీ గ్లోబల్ అకాడమీ కౌన్సిల్ జర్మనీ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ స్వీకరించినట్లు ఆచంట మండలం భీమలాపురానికి చెందిన ఏపీ రాష్ట్ర ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ నార్త్ సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షురాలు కొత్త కనక రత్నమాల తెలిపారు. మంగళవారం యూనివర్శిటీ చైర్మన్ డాక్టరు సుబ్బయ్య, వైస్ చైర్మన్ గోపీ కన్నన్, డైరక్టరు సురేష్ బాబు తదితరులు చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు వివరించారు.

రేపు మాంసం విక్రయాల నిలిపివేత

నరసాపురం: ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం మాంసం విక్రయాలు నిషేధించామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు కోళ్లు, మేకలు, ఇతర జంతువుల మాంసాన్ని విక్రయించకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు.